నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
3 | నిజామాబాద్, ఆదివారం 4 మే 2025 | NIZAMABAD

2025 - SSC ఫలితాల్లో State Ranksలతో నిజామాబాద్ కాకతీయ రికార్డ్ !
KOS SSC 2025 RESULTS - STATE LEVEL BEST MARKS

| | | | | | |
|---|---|---|---|---|---|
| 596/600 | 591/600 | 590/600 | 587/600 | 586/600 | 586/600 |
| S.Kriti 2505105869 | Nityesh 2505106761 | SNV Akhil 2505104317 | D.Kruthi 2505105933 | Sai Sreyas 2505105759 | G.Varshini 2505105332 |
| 585/600 | 585/600 | 584/600 | 583/600 | 582/600 | 582/600 |
| Adiba Siddiqui 2505104529 | Goutham 2505104144 | Jashwanth 2505102545 | Astha Gour 2505103994 | S.Bhavani 2505105330 | J.Yochana 2505106163 |

ఇంతటి అద్భుతమైన ఫలితాలకు కారకులైన కాకతీయ విద్యార్థినీ విద్యార్థులకు శుభాకాంక్షలు, విశేషమైన కృషినందించిన ఉపాధ్యాయ బృందానికి, ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రులకు, సిబ్బందికి Smt.CH.VIJAYA LAKSHMI, M.Sc., (Ph.D) Maths కృతజ్ఞతలు తెలిపారు.
550 above 122 Students Secured | 500 above 350 Students Secured
KAKATIYA OLYMPIAD SCHOOLS
PRAGATHI NAGAR & SUBASH NAGAR, NIZAMABAD

ధాన్యం కొనుగోళ్లపై
# సర్కారు నిర్లక్ష్యం

- నెల రోజులుగా రైతుల ఎదురుచూపులు
- రోడ్లపై ఎక్కడ చూసినా ధాన్యం రాసులే కనిపిస్తున్నయ్..
- ఎండకు ఎండుతూ..వానకు తడుస్తున్నాయ్..
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- మద్దతు ధరకు కొనకపోతే రైతులది ఆందోళన బాటే..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి




ఖలీల్‌వాడి, మే 3 : ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆగ్రహంవ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంటలను కొంటారో.. కొనరో ? సూటిగా చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పంటను అమ్మడానికి రైతులు నెల రోజులుగా కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నా, ఈ ఇందిరమ్మ రాజ్యానికి ఇసుమంత కనికరం కూడా లేదని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్లపై ఎక్కడ చూసినా ధాన్యం రాసులే కనిపిస్తున్నాయని, ఏ రైతును కదిపినా కన్నీటి గాథలే వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. రోడ్లు, కల్లాల్లో ధాన్యం ఎండకు ఎండుతూ తూకం తగ్గుతున్నదని, అకాల వర్షాలకు తడిసి ముద్దవుతున్నదని తెలిపారు. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అన్నదాత శ్రమ ఆవిరవుతున్నదని పేర్కొన్నారు. డొంకేశ్వర్, ఆలూర్, నందిపేట్, ఆర్మూర్ రూరల్ తదితర మండలాల్లో రైతులు ఎక్కువగా వరి పంట పండించారని, ధాన్యం కొనే దిక్కు లేక దైన్య స్థితిలో ఉన్నారని తెలిపారు.

**కొనుగోలు కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం**

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని జీవన్‌రెడ్డి విమర్శించారు. అటు ఐకేపీ, ఇటు సొసైటీలు కేంద్రాలు తెరిచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ, కల్లాలపై ధాన్యం రాసులు మాత్రం అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. ధాన్యం కొనేందుకు అనేక కొర్రీలు పెడుతూ, రైతులను అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం అమ్ముడుపోక రైతులు నానా అవస్థలు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నదని ధ్వజమెత్తారు. క్షేత్రస్థాయిలో దయనీయ పరిస్థితి నెలకొన్నదని, పంటల కొనుగోలుపై సర్కారు మాటలు నీటిమూటలేనని అర్థమవుతున్నదని జీవన్‌రెడ్డి విమర్శించారు. చివరి గింజ వరకు కొంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అదే అరిగిపోయిన రికార్డును పదేపదే వినిపిస్తున్నా, ఎక్కడా కొంటున్న దాఖలాలు లేవని తెలిపారు. గన్నీ సంచులు, కాంటాలు, లారీలు కనిపించడంలేదని పేర్కొన్నారు. మద్దతు ధర ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోతే, రైతాంగం ఆందోళన బాట పట్టక తప్పదని స్పష్టం చేశారు. అన్నదాతల ఆగ్రహాన్ని ప్రభుత్వం చవి చూడక తప్పదని జీవన్‌రెడ్డి హెచ్చరించారు.

- బోర్లు ఎత్తిపోయి.. పంటలు ఎండిపోయి
- మిత్తీల పాలైన రైతులు
- సర్కారు సాయమందక దిగాలు
- పంట చేతికొచ్చినా కల్లాలు దాటని వడ్లు
- దిక్కుతోచని స్థితిలో రైతాంగం

# అన్నదాత.. విలవిల





సంక్షోభంలో చిక్కుకున్న సాగు

**సాగు** సంక్షోభంలో చిక్కుకున్నది. దిక్కుతోచని స్థితిలో రైతాంగం దిగాలు చెందుతున్నది. బోర్లు ఎత్తిపోయి ఎండిన పంటలు.. బోర్లు వేసేందుకు చేసిన అప్పులు.. పెట్టుబడి రాక అన్నదాత గుండె చెరువైంది. ఇక, చేతికొచ్చిన పంట కాంటాలు కాక కల్లాలు దాటడం లేదు. రోజుల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ స్థితిలో ఏం చేయాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు.

**పెట్టుబడి మీదపడి..**

ఉమ్మడి జిల్లాలో రైతులు దాదాపు పది లక్షల ఎకరాల్లో యాసంగి పంటలు వేశారు. అయితే, వరి పొట్ట పోసుకునే సమయంలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నమే చేశారు. నాలుగైదు బోర్లు వేసినా నీటి జాడ కరువైంది. పంట సాగుకు పెట్టిన పెట్టుబడితో పాటు బోర్లకు అయిన ఖర్చు మీద పడింది. రూ.లక్షల్లో అప్పులు మీద పడడంతో రైతాంగం దిగాలు చెందుతోంది. అప్పులు తీర్చేదారి కనిపించక దోమకొండ మండలంలో ఓ యువ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు.

**కల్లాలు దాటని వడ్లు**

ఎలాగోలా కష్టపడి పండించిన వడ్లు అమ్ముకునేందుకూ రైతులకు ఇక్కట్లు తప్పట్లేదు. పంట కోసి పక్షం రోజులైనా కాంటాలు పడట్లేదు. ధాన్యం కల్లాలు దాటట్లేదు. ఏ రోడ్డు చూసినా వడ్ల కుప్పలతో నిండిపోయి కనిపిస్తున్నది. కొన్నిచోట్ల అయితే రోడ్డుకు ఇరువైపులా ధాన్యం రాసులే దర్శనమిస్తున్నాయి. ఏడాదిన్నర వ్యవధిలోనే మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. పంట కొనుగోలు చేయడం లేదని రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి దాపురించింది. గన్నీసంచులు లేవని, కాంటాలు వేయట్లేదని, తూకం వేసిన బస్తాలు తరలించట్లేదని అన్నదాతలు తరచూ ఆందోళనకు దిగుతున్నారు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడే బాగుండేదని గుర్తు చేసుకుంటున్న రైతులు.. ప్రభుత్వ మార్పు ముంచేదే తప్ప మంచిది కాదని చెబుతున్నారు.

పది బోర్లు వేసి.. పది లక్షల అప్పుల పాలై
## యువ రైతు ఆత్మహత్య



బీబీపేట్(దోమకొండ), మే 3: సాగునీటి జాడ కోసం చేసిన భగీరథ ప్రయత్నం విఫలమైంది. పది లక్షల దాకా అప్పు మీద పడింది. అది తీర్చే దారి కనిపించక పోవడంతో ఓ యువరైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామంలో శనివారం ఈ విషాద ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై స్రవంతి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగమేశ్వర్ గ్రామానికి చెందిన యువ రైతు పంతులుగారి పెంటయ్య(26)కు రెండెకరాల భూమి ఉంది. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబం. పొలంలో నీటి వసతి సరిగా లేకపోవడంతో పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు పెంటయ్య బోర్లు వేశాడు. రెండేండ్ల వ్యవధిలోనే పదికి పైగా బోర్లు వేశాడు. చుక్కనీరు రాకపోగా, అప్పే మిగిలింది. రూ.10 లక్షల దాకా రుణ ఊబిలో కూరుకుపోయిన పెంటయ్య.. తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం తెల్లవారుజామున ఇంట్లోనే చీరతో ఉరేసుకున్నాడు. ఈ ఘటన తీవ్ర విషాదం నింపింది. మృతుడి తల్లి మణెవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### సర్కారు సాయం కరువు

పదేండ్ల పాటు సంతోషంగా పంటలు పండించుకున్న రైతులు ఏడాదిన్నర వ్యవధిలోనే చిక్కుల్లో పడ్డారు. సర్కారు సాయం కరువై దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కేసీఆర్ హయాంలో పంట సాగుకు ముందే ఠంచన్‌గా రైతుబంధు అందించడంతో పెట్టుబడికి తిప్పలు తప్పాయి. పుల్లుగా కరెంట్, దండిగా నీళ్లు ఉండడంతో రెండు పంటలకు ఢోకా లేకుండా పోయింది. ఊరూరా కల్లాలు పెట్టి ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో రైతుల కష్టాలు దూరమయ్యాయి. అయితే, ఏమైందో ఏమో కానీ కాంగ్రెస్ వచ్చిన ఏడాదిన్నరలో పరిస్థితి తారుమారైంది. రైతుబంధు ఆగిపోయింది. రెండు సీజన్లకు సంబంధించిన పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం ఎగ్గొట్టింది. మొన్న యాసంగిలో రైతుభరోసా అమలు చేసినా, ఇంకా సగానికంటే ఎక్కువ మంది రైతులకు రాలేదు. మరోవైపు, చాలా మందికి రుణమాఫీ కాక అప్పుల ఊబి నుంచి బయటపడ లేకపోయారు.

## ఇద్దరిపై పోక్సో కేసు నమోదు



- డిచ్‌పల్లి మండలంలో ఆరేండ్ల బాలికపై వృద్ధుడి లైంగిక దాడి
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- జిల్లాకేంద్రంలో ఓ బాలికను ట్రాప్ చేసిన యువకుడు
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

డిచ్‌పల్లి/వినాయక్‌నగర్, మే 3 : నిజామాబాద్ జిల్లాలో ఇద్దరిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. డిచ్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఆరేండ్ల బాలికపై ఓ వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడగా.. జిల్లాకేంద్రంలో ఓ బాలికను యువకుడు ట్రాప్ చేశాడు. వృద్ధుడితోపాటు యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదుచేసి, రిమాండ్‌కు తరలించారు. డిచ్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో ఆరేండ్ల బాలికపై 65 ఏండ్ల వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మూడు రోజుల క్రితం వృద్ధుడు ఓ బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయం బాలిక కుటుంబీకులకు శుక్రవారం తెలియడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**బాలికకు మాయమాటలు చెప్పి..**

జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ బాలిక తన బంధువుల ఇంటికి రైలులో వెళ్తుండగా మహారాష్ట్ర లోని ధర్మాబాద్‌కు చెందిన అర్బాజ్ అనే యువకుడు(లేబర్) మాటామాట కలిపి పరిచయం చేసుకున్నాడు. ఏడాది కాలంగా ప్రేమపేరుతో వెంటబడిన సదరు యువకుడు, వారం రోజుల క్రితం బాలికను తన వెంట తీసుకువెళ్లాడు. బాలిక ఆచూకీ కోసం ఆమె తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌హెచ్‌వో రఘుపతి కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు. బాలికను వెంటబెట్టుకొని వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్న నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సదరు బాలికను ఆమె తల్లిదండ్రులకు అప్పగించి, యువకుడిపై శనివారం పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బావిలో పడి ఇద్దరు చిన్నారులకు
## తీవ్ర గాయాలు

- ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా ప్రమాదం
- నిజామాబాద్ దవాఖానకు తరలింపు

బాన్సువాడ, మే 3: ఇంటి ఆవరణలో నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసుకున్న ఓ బావిలో ఇద్దరు చిన్నారులు పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ ఘటన బాన్సువాడ పట్టణంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగమేశ్వర్ కాలనీకి చెందిన ఇర్ఫాన్ (7), రహెలా (7) ఇద్దరు చిన్నారులు శనివారం రాత్రి తమ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నారు. అయితే ఇంటి యజమాని ఇంటి అవసరాల కోసం రింగుల బావి ఏర్పాటు చేయించగా.. ప్రస్తుతం ఆ బావి అడుగంటిపోయింది. దీంతో వాటిపై రింగులు వేసి ఉంచారు. ఇద్దరు చిన్నారులు ఆడుకుంటున్న క్రమంలో బావిపైకి ఎక్కగా ఒక్కసారిగా సిమెంట్ రింగులు కూలిపోవడంతో చిన్నారులిద్దరూ అందులో పడిపోయారు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు వెంటనే బాన్సువాడ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉం దని అక్కడి వైద్యులు చెప్పడంతో నిజామాబాద్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇర్ఫాన్ పరిస్థితి విషమంగా ఉన్న ట్లు తెలిసింది.

## 'నీట్'కు ఏర్పాట్లు పూర్తి


- అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



కంఠేశ్వర్, మే 3 : జిల్లాలో నేడు నిర్వహించనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో 3,398 మంది పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 4, డిచ్‌పల్లి, బోధన్‌లో రెండు చొప్పున మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లో లోనికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వబోరని స్పష్టం చేశారు. కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించి సందేహాల నివృత్తి కోసం ఐడీవోసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 99121 92692, 98859 75254 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.


## ఉగ్ర భానుడు

దంచి కొడుతున్న ఎండలు



నిర్మానుష్యంగా మారిన జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా





**నిజామాబాద్ జిల్లాలో** కొన్నిరోజులుగా ఎండలు దంచి కొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం నుంచే భానుడు ఉగ్రరూపం దాల్చడంతో బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసరమైతేనే తగిన జాగ్రత్తలు తీసుకొని, బయటికి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో శుక్రవారం గరిష్ఠం 42.4, కనిష్ఠం 28.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





## ఎస్సెస్సీ టాపర్‌కు జడ్జి అభినందన

ఖలీల్‌వాడి, మే 3: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కాకతీయ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్.క్రితి అత్యుత్తమ మార్కులు (596/600) సాధించింది. ఆమెను జిల్లా న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి శనివారం అభినందించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ..క్రితి అత్యుత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులతోపాటు జిల్లా, రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిందని కొనియాడారు. ఇంతటి కృషికి కారకులైన కేవోఎస్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భాస్కరావు, వివిధ జ్యుడీషరీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



విద్యార్థిని క్రితిని సన్మానిస్తున్న జిల్లా న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి

## వడదెబ్బతో ఇద్దరి మృతి





బంగారు సాయిలు, బోడ నర్ల (ఫైల్)

నవీపేట/నిజాంసాగర్, మే 3: ఉమ్మడి జిల్లాలో వడదెబ్బతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. నవీపేట మండలంలోని మోకన్‌పల్లి గ్రామానికి చెందిన బంగారు సాయిలు(58), మహ్మద్‌నగర్ మండలం దూప్‌సింగ్ తండాకు చెందిన బోడ నర్ల(56) వడదెబ్బకు గురై మృతి చెందారు. నవీపేట మండలంలోని మోకన్‌పల్లి గ్రామానికి చెందిన బంగారు సాయిలు భిక్షాటన చేస్తూ కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. శుక్రవారం భిక్షాటన చేసేందుకు నిజామాబాద్ వెళ్లగా వాంతులు, విరేచనాలయ్యాయి. బంధువులు వెంటనే జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. సాయిలుకు నలుగురు కూతుళ్లు ఉన్నారు.

**దూప్‌సింగ్ తండాలో..**

మహ్మద్‌నగర్ మండలం దూప్‌సింగ్ తండాకు చెందిన బోడ నర్ల మూడు రోజుల క్రితం ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. ఇంటికి వచ్చిన తర్వాత ఓ పనిమీద ఎల్లారెడ్డికి వెళ్లి తిరిగి రాగా వాంతులు, విరేచనాలు చేసుకున్నాడు. కుటుంబీకులు వెంటనే బాన్సువాడ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య శాంతాబాయి, ఒక కొడుకు, కూతురు ఉన్నారు.